క్లుప్తంగా

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబితారెడ్డి, ఆలయ చైర్మన్ రత్నం

తుక్కుగూడ: మండల పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ 42వ వార్షికోత్సవం సందర్భంగా (బోనాలు, కల్యాణం) ఈ నెల 11 నుంచి 13 వరకు మూడురోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వార్షికోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: రాష్ట్రంలో ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ నెల 6న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. ఆదివారం పుర కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్‌పై బీజేపీ కపట నాటకం ఆడుతోందన్నారు. ఈ ధర్నాకు నియోజకవర్గం నుంచి బీసీలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఢిల్లీకి వచ్చే బీసీ నాయకులు ఈ నెల 4వ తేదీన ఉదయం 9 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలు అందుబాటులో ఉందన్నారు. 4న బీసీ రిజర్వేషన్ అమలు, 5న పార్లమెంట్ వాయిదా తీర్మానం, 6న మహాధర్నా, 7న రాష్ట్రపతిని కలిసి వినితిపత్రం ఇస్తామని తెలిపారు.

నేరాల నియంత్రణకు కెమెరాలు దోహదం



ఎమ్మెల్యే సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కాలనీసులు

బడంగ్‌పేట్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్‌లోని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కెమెరాలను ఎమ్మెల్యే సబితారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, పి.ఆనంద్‌రెడ్డి, సుర్గంటి అర్జున్, లిక్కి కృష్ణారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పుట్టగళ్ల సంతోష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, వెంకటేష్, యశ్వంత్, శంకర్, సురేష్, నర్సింహా, భాస్కర్, అశోక్ చక్రవర్తి, మహిళలు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని 28వ డివిజన్‌లోని శ్రీమారుతీనగర్ కాలనీవాసులు ఆదివారం క్యాంప్ ఆఫీస్‌లో మాజీ కార్పొరేటర్ సూర్గంటి అర్జున్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు మెరుగు వేణు మాట్లాడుతూ.. శ్రీమారుతీనగర్‌లో సమస్యలు తిష్ట వేశాయని డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిదీపాలు, కృష్ణావాటర్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. అధికారులతో చర్చించి త్వరలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని వారికి ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి క్రివేణి, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు సాయికుమార్, రాజిరెడ్డి, సభ్యులు కృష్ణమోహన్, వెంకట్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, రమేష్, ప్రదీప్‌కుమార్, చంద్రశేఖర్, లష్కర్‌నాయక్, అశోక్, రాజేందర్, కిరణ్, సాయిలాల్, విజయ్, సాయికృష్ణ, వేణు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రంగులద్ది.. ఆకర్షణీయంగా తీర్చిదిద్ది..

- చవితికి సిద్ధమవుతున్న గణనాథులు
- తుది దశకు చేరిన విగ్రహాల తయారీ

మహేశ్వరం/షాద్‌నగర్: (as printed: **మహేదీపట్నం**)

మహదీపట్నం: వినాయక చవితి సమీపిస్తుండడంతో బొజ్జ గణపయ్య విగ్రహాలు ముస్తాబవుతున్నాయి. ఆరు నెలల నుంచి మొదలైన గణనాథుల తయారీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. చవితికి కేవలం దాదాపు 20 రోజులు మాత్రమే ఉండడంతో ఇప్పటికే రూపం వరకు పూర్తయిన వినాయక ప్రతిమలకు శిల్పులు అందమైన రంగులు వేయడంలో నిమగ్నమయ్యారు. ఒకప్పుడు నగరంలోని దూల్‌పేట్‌లో లభ్యమయ్యే గణనాథుల విగ్రహాలను ప్రస్తుతం నగర శివారు ప్రాంతమైన జల్‌పల్లి, శ్రీరాంకాలనీ, వాంబేకాలనీ, లక్ష్మీగూడ పరిసరాల్లో పెద్ద ఎత్తున గూడారాల్లో తయారు చేస్తున్నారు. వీటిని తయారు చేసే నిర్వాహకులు దూల్‌పేటలోనే కార్యాలయాన్ని ప్రారంభించి గణనాథులను బుక్ చేసి ఇక్కడ డెలివరీ చేస్తుంటారు.

తీరొక్క గణనాథులు

విఘ్నాలు తొలగించేవాడు.. కళలు, శాస్త్రాలకు అధిపతి, బుద్ధికి, జ్ఞానానికి ఆరాధ్యుడిగా భావించి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించే గణనాథుడి విగ్రహాలను ఈ సారి తీరొక్క రూపంలో తయారు చేస్తున్నారు. 108 పేర్లతో పిలవబడే గణనాథుడి రూపాన్ని కూడా అయ్యప్ప, పహిల్వాన్, హనుమాన్, కూర్చొనే గణపతి, నిలబడిన గణపతి ఇలా రకరకాల గణనాథుల విగ్రహాలు సిద్ధం చేశారు. ఇప్పటికే తయారీ కేంద్రాలకు చేరుకుంటున్న భక్తులు తమకు నచ్చిన ప్రతిమను ఎంపిక చేసుకొని అడ్వాన్స్‌లు చెల్లించి బుక్ చేసుకుంటున్నారు. జల్‌పల్లి పరిసరాలలో తయారవుతున్న భారీ గణపయ్యలకు రూ.1 నుంచి 2 లక్షల వరకు ధరను నిర్ణయించారు.

ఇతర రాష్ట్రాల నుంచి శిల్పులు

ఆరు నెలల ముందు నుంచి ప్రారంభమైన వినాయక ప్రతిమల తయారీకి ఇతర రాష్ట్రాల నుంచి శిల్పులు, కార్మికులు నగరానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కుటుంబాలతో సహా ఇక్కడే ఉంటూ ప్రతిమలను తయారు చేయడంలో తలమునకలవుతున్నారు. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఈ శిల్పకళా నైపుణ్యాన్ని ముందుకు తీసుకెళ్తూ జీవనోపాధి పొందుతున్నారు. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన వారే అధికంగా వీటిని తయారు చేస్తున్నారు.

'గణేశ్ ఆగమన్'కు సిద్ధమవుతున్న భక్తజనం

గతంలో వినాయక నిమజ్జనం రోజు కనిపించే హడావిడి గతేడాది నుంచి ×గణేష్ ఆగమన్¥తోనే ప్రారంభిస్తున్నారు. బ్యాండ్ మేళాలు, ఆటాపాటలతో వందలాది మంది భక్తులతో ఊరేగింపుగా గణనాథుడిని మండపానికి తీసుకొచ్చి ప్రతిష్టిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న క్రేజ్ దృష్ట్యా ఇప్పటి నుంచే లడ్డూ, మండపం తయారీ, బ్యాండ్, సౌండ్ బాక్స్‌లు, డీజేలకు అసోసియేషన్ల ప్రతినిధులు ఆర్డర్‌లు ఇచ్చేస్తున్నారు. మొత్తం మీద గణేష్ హడావిడి మొదలైంది.



జల్‌పల్లిలోని తయారీ కేంద్రంలో మెరుగులద్దుకుంటున్న వినాయక ప్రతిమలు



గణనాథుడికి రంగులద్దుతున్న కళాకారుడు

భక్తుల అభిరుచికి అనుగుణంగా..



గత ఆరేళ్ల నుంచి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాను. పెద్దల నుంచి వారసత్వంగా తయారీ నేర్చుకున్నాను. బీహార్ నుంచి మొత్తం పది మంది గ్రూప్‌గా వచ్చాం. సంవత్సరంలో ఆరు నెలలు ఇక్కడ, మిగిలిన ఆరు నెలలు స్వరాష్ట్రంలో ఉంటాం. భక్తుల అభిరుచికి అనుగుణంగా భిన్నమైన గణనాథులను తయారు చేస్తాం. నిర్వాహకుల నుంచి తమకు మంచి సహకారం ఉంటుంది.

– రిత్విక్, తయారీదారుడు

ఘనంగా స్నేహితుల దినోత్సవం



సంబరాల్లో పాల్గొన్న స్నేహితులు

మొయినాబాద్‌రూరల్: అన్నదమ్ములుగా కలిసిమెలసి ఉండడంతో పాటు కష్టసుఖాలను పాలుపంచుకున్నప్పుడే స్నేహానికి అర్థం ఉంటుందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ మండల నాయకుడు కుమ్మరి రాము అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎన్కేపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దాదాపు 40 మంది స్నేహితులందరూ ఏకమై విద్యార్థి దశ నుంచి నేటి వ్యాపార ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్న వారంతా కష్టసుఖాలను పాలుపంచుకున్నారు. ఒకరినొకరూ చేస్తున్న ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలను, కష్టసుఖాలను తెలియజేశారు. అనంతరం కేక్‌కట్ చేసి తినిపించుకున్నారు. అనంతరం కుమ్మరి రాము మాట్లాడుతూ.. ఎన్కేపల్లిలో చిన్నపెద్దా తారతమ్యం లేకుండా అన్నదమ్ములుగా, స్నేహితులుగా 20 సంవత్సరాల నుంచి అలాగే కొనసాగుతోందన్నారు. కలిసిమెలసి ఉండడంతో కష్టసుఖాల్లో పాలుపంచుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో దానయ్య, సుభాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: కార్మికుల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీఐటీయూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని చందనవెల్లి పారిశ్రామిక ప్రాంతంలో కంపెనీ కార్మికులకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వలస కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని.. అయినప్పటికీ కార్మిక శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా సీఐటీయూ ముందుండి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సీహెచ్ భీమయ్య, నాయకులు వడ్డే అంజయ్య, బాల్‌రాజ్, మానయ్య, సాయిలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

తవ్వడం సరే.. పూడ్చడం ఎప్పుడో?



లక్ష్మీనగర్ కాలనీలో ఇటీవల వేసి తవ్విన సీసీ రోడ్డు



ఎస్‌బీహెచ్ కాలనీలో మరమ్మతుకు నోచుకోని బీటీ రోడ్డు

మలక్‌పేట: అభివృద్ధి పేరిట బాగున్న రోడ్లను తవ్వుతుండటంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది. పైపులైన్ల ఏర్పాటు కోసం కాలనీల్లోని అంతర్గత రోడ్లు తవ్వి సరిగా పూడ్చకుండా వదిలేస్తుండంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. తాగునీరు, డ్రైనేజీ ఇతర పైపులైన్ల కోసం బీటీ, సీసీ రోడ్లను తవ్వి పూడ్చడం లేదు. దీంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. కొన్నిసార్లు రోడ్లను తవ్వగా వచ్చిన మట్టి, వ్యర్థాలు అలాగే రోడ్లపై వదిలేస్తున్నారు. అస్తవ్యస్తంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కాలనీల్లోని రోడ్ల దుస్థితి ..

కాలనీలోని రోడ్లను తవ్వి వదిలేస్తుండటంతో వర్షాలకు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ, లక్ష్మినగర్ కాలనీ, శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లన్నీ గుంతలమయం మారాయి. విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండటంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాడైపోయిన రోడ్ల మూలంగా వాహనదారులు పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా యాదయ్య



మహేశ్వరం: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మహేశ్వరం మండలం నాగారం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు పల్లాటి యాదయ్య ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు మొయినాబాద్‌లో అంజనీదేవి గార్డెన్‌లో జరిగిన సీపీఐ జిల్లా మహాసభలలో సభ్యులు ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సమస్యలపై నిరంతరం పోరాడుతానన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. తన ఎన్నికకు సహకరించిన సీపీఐ జిల్లా అధ్యక్షుడు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు.

రేకుల షెడ్డు ఏర్పాటుకు కృషి

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ బ్యాంక్ కాలనీలో ఉన్న పోచమ్మ, ఎల్లమ్మ దేవాయలయంపై ఉన్న రేకుల షెడ్డును అక్రమంగా నిర్మించారని ఇటీవల అధికారులు తొలగించారు. షెడ్డును తిరిగి నిర్మించేందుకు సహకరించాలని పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. షెడ్డు నిర్మాణానికి ఎలాంటి సమస్యల లేకుండా అధికారులతో మాట్లాడి నిర్మించేందకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ, నందకిషోర్ పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఆటల పోటీలు

వనస్థలిపురం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో ఆదివారం సీనియర్ సిటిజెన్స్ ఫోరం, కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యారంబోర్డు, చెస్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జ్ఞానేశ్వర్, హరిప్రసాద్, ఆర్‌కే.ప్రసాద్, బీజీవీ.ప్రసాద్, రాజేంద్రప్రసాద్, డా.అప్పారావు, శ్రీనివాసరావు, కేఎల్ఎన్.రావు పాల్గొన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్‌లో ఖాళీలు భర్తీ చేయాలి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్‌లో ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమశాఖను స్వతంత్ర శాఖగా కొనసాగించాలని, 33 జిల్లాలో ఏడీ ఆఫీసులు తెరవాలన్నారు. ఓహెచ్, రోస్టర్ పాయింట్ 10 లోపు మార్చుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. డ్రెస్ కోడ్ ఉద్యోగాలలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ విషయంలో కార్పొరేషన్ ఎండీ శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్య చొరవ చూపి అమలుకు సహకరించాలని కోరారు.

స్నేహితుడికి ఆర్థికసాయం అందజేత



మిత్రుడి భార్యకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మహేశ్వరం: కందుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన విద్యార్థి సీహెచ్ లింగం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వైద్య ఖర్చులకు తోటి విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. లింగం మండల కేంద్రంలో బీరువాలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి బైక్‌పై వస్తుండగా రాచులూరు గేటు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లింగంకు కాలు, చేయి, పక్కటెముకలు విరిగిపోయాయి. ఆస్పత్రిలో వైద్యం కోసం భారీగా ఖర్చు అవుతుండడంతో తోటి విద్యార్థులు విషయం తెలుసుకొని రూ.45 వేలు ఆర్థికసాయం అందజేసి.. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బర్కం వెంకటేశ్, సొడపు శేఖర్‌గౌడ్, ఎడ్ల వెంకటేశ్‌ముదిరాజ్, జంగాచారి, సుబాష్, మల్లేష్, రాంచంద్రి పలువురు పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయండి

గౌడ సంఘం మండల అధ్యక్షుడు సుధీర్‌గౌడ్



వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహేశ్వరం: ఈ నెల 10న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ 375వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో పాపన్నగౌడ్ జయంతి వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మొట్టమొదటి బహుజన వీరుడన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారోత్సవాలు హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు వట్టికూటి రామారావుగౌడ్, పి. సురేష్‌గౌడ్, కొండా రాజేశ్‌గౌడ్, మచ్చేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాపిరాజుగౌడ్, వరుణ్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌ల సహకారంతో సేవా కార్యక్రమాలు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్వర్‌రావు

వనస్థలిపురం: లయన్స్ క్లబ్ వనస్థలిపురం రెండవ వార్షిక ఇన్‌స్టాలేషన్ కార్యక్రమ ఆదివారం వనస్థలిపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 320హెచ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వనస్థలిపురం అధ్యక్షుడిగా ఎస్‌జేఎస్.నందకిశోర్, కార్యదర్శిగా రవిందర్‌రెడ్డి, కోశాధికారిగా నరసింహులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ నందకిశోర్ మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ దూరయ్య, ఆర్సీ రమేష్, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరుగు.. ఆరోగ్యానికి మెరుగు



రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: పరుగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. బండ్లగూడ డీఆర్ఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో కేఎన్ఆర్ సైక్లింగ్ నాగరాజు ఆధ్వర్యంలో ఇందు ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ హిస్టారికల్స్ 10కే రన్, రైడ్ 3వ ఎడిషన్‌ను ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. పరుగెత్తడంతో గుండె కండరాలు బలంగా తయారువుతాయని, ఇది గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుందని తెలిపారు. 10కే రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

షాద్‌నగర్: విద్యలో రాణించడం ద్వారా సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన సంగెం ప్రభాకర్ ప్రమోటర్ మోటిఫ్ ఎనాలిసిస్ ఆఫ్ జీఎస్ఆర్‌హెచ్ 1 ఇన్ బోనీఫిషెస్ అనే అంశంపై పరిశోధన జరిపిన గ్రంథాన్ని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం బాబయ్య దూసకల్ గ్రామానికి వెళ్లి సంగెం ప్రభాకర్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యలో రాణించిన వారికి సమాజంలో ప్రత్యేక స్థానం లభిస్తుందన్నారు. కృషి, పట్టుదల ఉంటే కానిదేది అసాధ్యమన్నారు. సంగెం ప్రభాకర్ పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీకి అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్‌లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కొనసాగుతోందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ శివపురి కాలనీలో రూ.47 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో చేపట్టనున్న 200 మీటర్ల డ్రైనేజీ పనులను ఆదివారం ఆయన కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు డివిజన్‌లో కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, ముంపునకు గురి కాకుండా నాలాలు, వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో చేపట్టనున్న సీఎం రోడ్డు వెడల్పుకు స్థానికులు సహకరించాలని కోరారు. డివిజన్‌ను చెత్త రహితంగా తీర్చి దిద్దాలంటే ప్రజల సహకారం అవసరమని, ప్రతి ఒక్కరు చెత్తను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌గౌడ్, సురేష్, రాజు, మధుసూదన్ చారి, విష్ణువర్ధన్, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణ్‌కుమార్, శ్రీకాంత్, గోవర్ధన్, అమీర్, వెంకట్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థులకు చెక్కులు అందజేసిన ట్రస్ట్ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య పేద విద్యార్థులకు శ్రీ వాసవి విద్యా ట్రస్ట్ అండగా ఉంటుందని ఫౌండర్ దుబ్బ అనిల్‌కుమార్ తెలిపారు. ఆర్‌కేపురం డివిజన్ హరిపురి కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవనంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభా కనబరిచిన 37 మంది పేద విద్యార్థులకు రూ.8,44,204 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ట్రస్ట్ గత మూడు సంవత్సరాలుగా ఆర్థికంగా వెకుకబడ్డ ఆర్యవైశ్య విద్యార్థుల చదువు కోసం సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు చెక్కుల పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మురళీధర్, అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.